# అంతఃపురంలో కటిక చీకట్లు

చల్లా. రాధాకృష్ణశర్మ

"శ్రీసీతా !"

"... ... .."

"సీతా !"

ఈసారి కంఠస్వరం మరింత స్పష్టంగా ఉంది. అయినా సీత ప్రత్యుత్తరం వినిపించ లేదు.

'కోడలింకా నిద్రలేవలేదు కాబోలు...పాపం, నెలల మనిషిగదా! బద్ధకంగా పడుకుందేమో!..' అనుకుని, కౌసల్య కొంచెం బిగ్గరగా, "సీతా ! వేపపుల్ల తీసుకురావూ. " అంది.

కౌసల్యకి ముసలితనం వచ్చింది. కంటి చూపు తగ్గుముఖం పట్టింది. అందువల్ల ఇతరుల సహాయంలేకుండా ఏ పనీ చేసేదికాదు.

సీత అంటే కౌసల్యకి వల్లమాలన అభిమానం. దాస దాసీజనం ఎంతమంది వున్నా, తన పనులు సీత చేస్తేనే ఆమెకి అంతులేని తృప్తి పైగా ఏ పని చేసినా, సీత సహర్షంగా చేసేది; తృప్తికరంగా చేసేది అదీకాక అత్తగారి మనస్సు, అభిరుచులూ ఆమెకి తెలిసినట్టుగా మరొకరికి తెలియవు నెలల మనిషయినా ఆమె స్వయంగా అత్తగారి పనులు చూసేది. దంత ధావనం మొదలుకొని వస్త్రధారణవరకూగల అన్ని పనులూ — చిన్నవీ — పెద్దవీ— ఆమె చూసేది.

ఉదయం నిద్రనుంచి మేల్కొనగానే సీత నిర్వర్తించవలసిన మొదటి పని అత్తగారి దంతధావనానికి కావలసిన యేర్పాట్లు చేయడం

ఆ రోజు సీత నిద్రనుంచి లేవడం ఆలస్య మయింది. అప్పుడే అత్తగారు కోడల్ని రెండు సార్లు పిలవడం జరిగింది

తల్లి సీతను పిలవడం రామచంద్రుడు విన్నాడు. వెంటనే మేడమీది తన గదిలోంచి బయటికి వచ్చాడు కిందికి చూశాడు. తల్లి మెట్ల దగ్గర నిలబడివుంది.

"వస్తున్నానమ్మా" అంటూ రాముడు ఒక హేమపాత్ర నిండా నీళ్ల నింపుకుని మెట్లు దిగసాగాడు

"ఇదుగో నీళ్లూ ... వేపపుల్ల .. "

"నువ్వే తెచ్చావా నాయనా ... " అంటూ కౌసల్య రామచంద్రుడి వైపు దీక్షగా చూసింది. ప్రసన్నవదనుడుగా లేదు

ఆమె భయభ్రాంత అయింది. "కోడలింకా నిద్రలేవలేదు కాబోలు ... నెలల మనిషిగదా..."



# వేమన పద్యాలు




బొంది వేఱు కద్దె భువి ప్రాణమొక్కటే
అన్నములిల వేఱె యాకలొకటి
పుష్పములిల వేఱు పూజలొక్కటే సుమ్ము
విశ్వదాభిరామ వినురవేమ.

తల్లి మాటలు రాముడికి వినిపించినట్టు లేదు

"ఇంకేమన్నా కావాలా అమ్మా!"

"వద్దులే నాయనా ... అదుగో కోడలే వస్తోంది."

రాముడు చరచర వెళ్లిపోయాడు

## అంతఃపురంలో కటిక చీకట్లు

కౌసల్య ఎందుకో తల్లడిల్లిపోయింది

"అత్తయ్యా! యివాళ లేవడం చాలా ఆలస్యమయింది" అంటూ సీత అత్తగారిని సమీపించింది అక్కడున్న హేమ పాత్ర, వేపపుల్ల మొదలైన వాటిని చూసి, "నా వల్ల ఆయన కెంత శ్రమ కలిగింది యివ్వాళ" అంది

"ఇంత మాత్రానికే ఏమీ అరిగిపోదులే" అంటూ కౌసల్య దంతధావనలో మునిగిపోయింది

రోజూ ఉల్లాసంగా కనిపించే సీత ఆనాడు నిరుత్సాహంగా కనిపించింది

అలా కొంచెంసేపు ఉద్యానవనంలో విహరించి వద్దామనుకుని బయలుదేరిన సీత మధ్యలోనే ఆగిపోయింది ముందుకి నడక సాగలేదు రామ లక్ష్మణుల సంభాషణ వినిపిస్తోంది

"అన్నయ్యా! వదిన అంత తప్పు ఏం చేసిందని యీ శిక్ష?"

"ఇది నా ఆజ్ఞ"

"నీ ఆజ్ఞను పాటించడం నా విధ్యుక్త ధర్మం అయినా కారణం అడక్కూడదా?"

"అమ్మ మాటను విననట్లుగా వదిన నటించింది. యమునా నదీతీరాన ఒక పర్ణశాల నిర్మించు అక్కడే వదిన వుంటుంది"

"అన్నయ్యా!"

"ఇది నా ఆజ్ఞ అన్నానుగా" రాముడు మాట్లాడలేకపోయాడు అక్కడినుంచి వెళ్లిపోయాడు

దీనవదనుడైన లక్ష్మణుడు నాలుగు అడుగులు ముందుకు వేశాడో లేదో వదినగారు తల వంచుకుని కనిపించింది అతనికి దుఃఖం ముంచుకువచ్చింది ఉత్తరీయంతో ముఖం చాటు చేసుకున్నాడు

మరిదిని చూడలేకపోయింది సీత రాముణ్ణి కలుసుకునేందుకు మేడవైపుకి దారితీసింది

"ఏమిటీ అన్యాయం"

సీతని చూసేసరికి రాముడికి కళ్లవెంట నీళ్ళు తిరిగాయి

"నేను చేసిన తప్పేమిటి? నన్నెందుకు యిలా శిక్షిస్తున్నారు? నా మీద మీకు ప్రేమ లేదా జాలిలేదా."

"సీతా!" రాముడి నోటివెంట మాట రాలేదు

సీత రాముడి యెదను తలచేర్చి వెక్కి వెక్కి యేడవసాగింది

"సీతా! నువ్వు నా కంఠహారానివి" గద్గద కంఠుడై రాముడు చెపుతున్నాడు. ఆమెకి అంతా అగమ్యగోచరంగా వుంది కాళ్లకింద నేల కంపించిపోతోంది అప్పటికప్పుడే పరిసరాలు కటిక చీకట్లతో నిండిపోయాయి

"సీతా! నువ్వెందుకు అత్తగారి మాట విననట్లు." రాముడి దగ్గదకంఠం వినిపిస్తూ వుంది సీత చెవుల్లో చెట్లు మొలిచినట్టయింది

అంతఃపురంలో ఎవరు చూసినా నిరుత్సాహంగా కనిపించారు అంతఃపుర కాంతలు శోకదేవతల్లా గోచరించారు.. కౌసల్య అయితే కుప్పలా కూలిపోయింది ★